
పాతికేళ్లలో తట్ట కంకర వేయలేదు..!

- నెమలిపురి పంచాయతీ టీఎస్ నగర్‌లో సమస్యల తిష్ట
- రెండు దశాబ్దాలకు పైగా మౌలిక వసతులు కరువు
- ఇప్పటికీ ఇళ్ల పట్టాలు ఇవ్వని ప్రభుత్వాలు
- కనీసం ఒక్క వీధికి సీసీ రోడ్డు పడని దుస్థితి



టీఎస్ నగర్ ఏరియల్ వ్యూ

రాజుపాలెం: మండలంలోని కోట నెమలిపురి పంచాయతీ పరిధిలోని టీఎస్ నగర్(తరిమెళ్ల నాగిరెడ్డి కాలనీ)ను సమస్యలు వెన్నాడుతున్నాయి. తరిమెళ్ల నాగిరెడ్డి పోరాట ఫలితంగా ఈ కాలనీ ఏర్పడింది. నివాసితులందరూ కొండమోడు సమీపంలోని ముగ్గు క్వారీలో కూలికి వెళ్తుంటారు. చాలీచాలని కూలితో కుటుంబాలు జీవనం సాగిస్తున్న వీరికి మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది.

మౌలిక వసతులు కరువు

టీఎస్ నగర్‌లో 265 గృహాలున్నాయి. 1,080 మంది జనాభా ఉన్నారు. గత ప్రభుత్వం చొరవతో కొంతమందికి మాత్రమే ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ఫారెస్టు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికీ చాలా కుటుంబాలు పూరి పాకాలు, రేకుల షెడ్లలో నివాసం ఉంటున్నాయి. కాలనీలో సైడు కాల్వలు లేవు. దీంతో మురుగు నీరంతా రోడ్లపైనే ప్రవహిస్తోంది. స్థానికంగా ఉన్న చేతి పంపు మరమ్మతులకు గురికావడంతో మెకానిక్ పంపు వస్తువులన్నీ తీసుకెళ్లి ఇంత వరకు బిగించలేదు.



నిరుపయోగంగా పడి ఉన్న చేతిపంపు

విష సర్పాల సంచారం

కాలనీలోని పాఠశాలకు వెనుక భాగంలో అటవీ ప్రాంతం ఉంది. ఇక్కడ విష సర్పాలు సంచరిస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. విద్యార్థులు భయం భయంగానే చదవుతున్నారు. పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని అధికారులకు విన్నవించినా ఫలితం లేదని చెబుతున్నారు.



పిచ్చి మొక్కలతో రహదారి

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

ఇళ్ల స్థలాలకు పట్టాలిస్తే ఇళ్లు నిర్మించుకుంటామని కాలనీ వాసులు చెబుతున్నారు. ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం ద్వారా పక్కా గృహాలు నిర్మాణానికి, రిజిస్ట్రేషన్లకు అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సీసీ రోడ్లు వేయాలి



కాలనీ ఏర్పడి రెండు దశాబ్దాలవుతోంది. ఇంత వరకు ఒక్క బజారుకు కూడా సీసీ రోడ్లు వేయలేదు. వర్షాకాలం రోడ్లు అధ్వానంగా ఉంటున్నాయి. కొండ ప్రాంతానికి దగ్గరగా ఉండడంతో రాత్రిళ్లు విష సర్పాల బెడద అధికంగా ఉంది.

– మిరియాల వసుంధర, కాలనీవాసి

అందరికి ఇళ్ల పట్టాలివ్వాలి



ఇళ్ల పట్టాలు లేకపోవడం వల్ల ఇప్పటికీ ఇళ్లు నిర్మించుకోలేక పోతున్నాం. 20 ఏళ్ల నుంచి రేకుల షెడ్డులోనే ఉంటున్నాం. ఇళ్ల పట్టాలు అందరికి ఇవ్వాలి. దీనిపై ప్రభుత్వం స్పందించాలి.

– రామిశెట్టి నాగేంద్రం, కాలనీవాసి

ప్రహరీ నిర్మాణం చేయాలి



స్థానిక పాఠశాలకు ప్రహరీ లేదు. లోపలికి అప్పుడప్పుడూ విష సర్పాలు వస్తున్నాయి. దీంతో పిల్లలు భయపడుతున్నారు. అధికారులు స్పందించి ప్రహరీ ఏర్పాటు చేయాలి.

– మిరియాల కోటేశ్వరమ్మ, కాలనీవాసి

క్లుప్తంగా

శాస్త్రోక్తంగా నవకలశ పంచామృత స్నపన



అమరావతి: మండలంలోని మల్లాది గ్రామం వటవృక్షాంతర్గత వేంకటేశ్వరస్వామి ఆలయ 48వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం నవకలశ పంచామృత స్నపన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చక స్వామి వినుకొండ శ్రీనివాసాచార్యులు మూల విరాట్‌కు పంచ సూక్తయుత పంచామృత స్నపన నిర్వహించి, స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. బుధవారం జరగబోయే స్వామి వారి కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

200 మందికి నేత్ర పరీక్షలు



సత్తెనపల్లి: ఉచిత నేత్ర వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని 16వ వార్డు కౌన్సిలర్ కంభంపాటి అబ్రహం అన్నారు. పట్టణంలోని వడవల్లి 16వ వార్డులో కలాం అబిల్ కలామ్ ఛెరిస్సా సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 200 మంది శిబిరానికి హాజరై నేత్ర వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అగర్వాల్ నేత్ర పరీక్ష కేంద్రం సిబ్బంది డాక్టర్ చందోలు నాగవాణి, సుజాత, మస్తానవలి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో పాస్టర్ సత్యా నందం, బండారు నాగరాజు, చిలుకా రమణయ్య, ఎంఈఎఫ్ నాయకులు గరిక పాటి హిట్లర్, చిలుకా జాన్సన్, బొద్దు సాయి, నల్లూరి కిరణ్, మహిళలు పాల్గొన్నారు.

నేటి నుంచి పశు వైద్య శిబిరాలు

క్రోసూరు: పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి మండలంలోని గ్రామాల్లో పశు ఆరోగ్య వైద్య శిబిరాలు జరుగుతాయని మండల పశువైద్యుడు డాక్టర్ మల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు పెరికపాడు, బయ్యవరం, 21న ఆవులవారిపాలెం, క్రోసూరు, 22న అందుకూరు, బాలెమర్రు, 23న విప్పర్ల, ఊటుకూరు, 27న అనంతవరం, హసనాబాద్, 28న హసనాబాద్, పారుపల్లి, 29న నాగవరం, పీసపాడు గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు జరుగుతాయన్నారు.

సత్తెనపల్లిలో..

సత్తెనపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మంగు శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువులకు పరీక్షలు చేయడంతో పాటు నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు, అవగాహన సదస్సులు, పశువుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలు, గోకులం షెడ్లు, బహువార్షిక పశుగ్రాసాల సాగు, సంచార పశు ఆరోగ్య సేవా వాహనాలు, పశు బీమా పథకం తదితర వాటిపై అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు.

అమరావతిలో..

అమరావతి: మండలంలో సోమవారం నుంచి నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలకు రైతులందరూ సహకరించాలని పశుగణాభివృద్ధి శాఖ ఏడీ వెంకట్రామయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో గేదెలు, ఆవులు, ఎద్దులు, గొర్రెలు, కోళ్లకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి, పూర్తి స్థాయి వైద్యం అందెంచేందుకు రెండు బృందాలు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఎండ్రాయి, వైకుంఠపురం, 21న చావపాడు, దిడుగు, 22న మండెపూడి, మునగోడు, 23న కర్లపూడి, అత్తలూరు, 24న ఉంగుటూరు, లింగాపురం, 25న మల్లాది, 27న నెమలికల్లు, జూపూడి, 28న నరుకుళ్లపాడు, పెదమద్దూరు, 29న ముత్తాయపాలెం, అమరావతి, 30న లేమల్లె, ధరణికోట గ్రామాల్లో శిబిరాలు జరుగుతాయని తెలిపారు.

గుండెపోటుతో హోంగార్డు మృతి



అజయ్ (ఫైల్)

వినుకొండ (నూజెండ్ల): నియోజకవర్గంలోని ఈపూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మల్లవరపు అజయ్(42)కు గుండెపోటు రావటంతో గుంటూరు లలిత హాస్పిటల్‌కు నాలుగు రోజులు క్రితం తరలించి చికిత్స అందిస్తుండగా ఆదివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. మృతదేహాన్ని అతని స్వగ్రామం వినుకొండ మండలం అందుగుల కొత్తపాలెం గ్రామానికి తరలించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతంలో అజయ్ నియోజకవర్గంలోని పలుస్టేషన్‌ల్లో హోంగార్డుగా విధులు నిర్వహించాడు.

హిందీ పండిట్‌కు పూలే అవార్డు

రాజుపాలెం: మండల కేంద్రంలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న రంగా జ్యోతిలక్ష్మి సావిత్రీబాయి పూలే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలి ప్రతిభ అవార్డుకు ఎంపికయ్యింది. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిర్ ఆడిటోరియంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు అవార్డును ఆదివారం ప్రదానం చేశారు. పాఠశాల హెచ్‌ఎం పీవీ ఇన్నారెడ్డి, ఫాదర్స్ విజయ్ పీటర్, కిరణ్, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.



అవార్డు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ, ఫాదర్స్

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పెదకూరపాడు: గుంటూరుకు చెందిన లలితా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని లింగంగుంట్ల గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సీనియర్ న్యూరాలజిస్ట్ పి.విజయ, సీనియర్ న్యూరోసర్జన్ శ్రీనివాసరావు, సీనియర్ ఆప్తామలజిస్ట్ విజయబాబు సుమారు 200 మందికి పైగా రోగులను పరీక్షించారు. బీజేపీ, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా ముందులు పంపిణీ చేశారు. డాక్టర్ మాలతి, డాక్టర్ సతీష్, డాక్టర్ యశ్వంత్, హస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ జోన్ చైర్మన్‌గా నాగేశ్వరరావు



సత్తెనపల్లి: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ జోన్ చైర్మన్‌గా సత్తెనపల్లి వాసవి మణికంఠ క్లబ్ పూర్వాధ్యక్షుడు వనమా నాగేశ్వరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం నరసరావుపేటలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన మొదటి క్యాబినెట్ సమావేశంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వనమా నాగేశ్వరావు మాట్లాడుతూ అమరావతి వాసవి క్లబ్ కపుల్స్, తుళ్లూరు వాసవి క్లబ్, తాడికొండ వాసవి క్లబ్, రావెల వాసవి క్లబ్‌లు తన పరిధిలో ఉంటాయన్నారు. నాగేశ్వరావును ఆర్యవైశ్య నాయకులు, రోటరీ క్లబ్ బాధ్యులు ఆదివారం అభినందనలు తెలిపారు. రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ జోనల్ చైర్మన్ బెల్లంకొండ నాగసాయి ప్రసాద్, ప్రెసిడెంట్ మాతంగి సాంబశివరావు, క్లబ్ డైరెక్టర్లు సరికొండ రమాదేవి, మిరియాల వెంకటేశ్వరరావు, డాక్టర్ లేళ్ళ అయోధ్య కృష్ణ, కంచేటి నాగేశ్వరరావు, క్లబ్ సభ్యులు ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

- నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు
- వరవకట్టలో కార్డెన్ సెర్చ్



వరవకట్టలో స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ విజయచరణ్, సిబ్బంది

నరసరావుపేట: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ, అల్లర్లు సృష్టిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారు ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదని నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పర్యవేక్షణలో ఆదివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వరవకట్టలో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటిని తనిఖీ చేసి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. కొత్త వ్యక్తులు, అనుమానితులు ఎవరైనా కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారికి సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఇస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఆ సమయంలో వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు తెలుపకపోతే స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలను ఉక్కుపాదంతో అణిచివేస్తామని సీఐ విజయ్‌చరణ్ హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు, ప్రజా స్వేచ్ఛ జీవనానికి ప్రజలు సహకరించాలని కోరారు. రూరల్ ఎస్ఐ కిషోర్, వన్‌టౌన్ పట్టణ ఎస్ఐ అరుణరెడ్డి, టూటౌన్ ఎస్ఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

వేమన పద్యాలు మరువలేం



పెదకూరపాడు: మండలంలోని 75 తాళ్లూరు గ్రామంలో యోగి వేమన జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువుల పాల్గొన్నారు. కొల్లి బ్రహ్మారెడ్డి, వెంకట్ రెడ్డి శివారెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఈడ శ్రీనివాస్‌రెడ్డి, అల్లం మాధవరెడ్డి గుత్తికొండ శ్రీనివాస్‌రెడ్డి, జన్నవరపు కోటిరెడ్డి, తిరువతమ్మ తదితరులు యోగి వేమన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

దివ్యాంగుడిపై ఎమ్మెల్యే వర్గీయుల దాడి!



చిలకలూరిపేట: దివ్యాంగుడైన ఓ పత్రికా విలేకరిపై టీడీపీ వర్గీయులుగా భావిస్తున్నవారు దాడికి పాల్పడిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితుడు గూడూరు సుబ్బు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... పట్టణంలోని పెదనందిపాడు రోడ్డులో ఉన్న ఓ బార్‌అండ్ రెస్టారెంట్ వద్ద సుబ్బుకు మిత్రుడైన సుధీర్‌పై మిట్టపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న సుబ్బు ఎందుకు అతనిని కొడుతున్నారని ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన వారు మేం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బంధువులం, ఎవరినైనా కొడతాం అంటూ సుబ్బుపై కర్రలతో విచక్షణారహితంగా దాడి చేసి కొట్టారు. దీంతో గాయాల పాలైన సుబ్బు ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై అర్బన్ సీఐ పి.రమేష్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాహు-కేతు పూజలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం రాహుకేతు పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొమ్మవరకు పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించే పూజాధికాల్లో పాల్గొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. విశేష అలంకరణలో ఉన్న రాహుకేతువులను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్నారు.

కబడ్డీ సీనియర్స్ జిల్లా జట్టు ఎంపిక

పిడుగురాళ్ల : స్థానిక మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా సీనియర్స్ కబడ్డీ జట్ల ఎంపిక ఆదివారం జరిగింది. కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డి.నాగాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు ఎంపికలో పాల్గొన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి 27 వరకు విశాఖపట్నం జిల్లా అంకుపాలెంలో 71వ అంతర జిల్లాల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కందుల వెంకటేశ్వరరావు, కార్యదర్శి డి.నల్లిరెడ్డి, ఉపాధ్యక్షుడు అక్కల శ్రీనివాసరెడ్డి, ఎం.నాగేంద్రబాబు, నల్లపాటి ధనుంజేయులు, ఆవుల జనార్ధన్, మదినా మస్తాన్‌వలి, షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన జిల్లా జట్టు

ధాన్యం కొనుగోలు సత్వరమే ప్రారంభించాలి

శావల్యాపురం: ధాన్యం కొనుగోలు సత్వరమే ప్రభుత్వం ప్రారంభించాలని సీపీఎం మండల కార్యదర్శి రైతుసంఘం నాయకుడు కనగాల వెంకట రామ మోహన్‌చందు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రం శావల్యాపురంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కొన్ని రోజుల నుంచి ధాన్యం కొనుగోలు పూర్తిస్థాయిలో నిలుపుదల చేయటంతో గత్యంతరం లేక రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారన్నారు. ప్రభుత్వం సత్వరమే కొనుగోలు ప్రారంభించాలన్నారు. రైతుల ముసుగులో దళారులు ప్రభుత్వానికి ధాన్యం అమ్మటం హేయమైన చర్య అన్నారు. కొనుగోలు కేంద్రాలు నిలుపుదల చేయటం వల్ల దళారులు ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించి రైతులను దోచుకోవటంతో పాటు కాటాల్లో కూడా మోసం జరుగుతుందన్నారు. తూనికల కొలతలు శాఖ అధికారులు నిద్ర మత్తు విడి తక్షణమే కాటాలపై నిఘా ఉంచి తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆశించిన స్థాయిలో దిగుబడులు వచ్చిన కొనుగోలు నిలుపుదల చేయటం వలన రైతులు బహిరంగ మార్కెటులో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయనతో పాటు రైతుసంఘం నాయకులు భువనగిరి వెంకటేశ్వర్లు, గణపర్తి వెంకటేశ్వర్లు, బోయపాటి వెంకటరాయుడు పాల్గొన్నారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్షాల నాయకులు

అమరావతి: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉభయ కమ్యూనిస్టు పార్టీల నాయకులు ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రంలో అమిత్ షా పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్షాల రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా అమిత్‌షా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు భైరాపట్నం రామకృష్ణ, సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మునుగోడు శ్రీనివాసరావు, చెన్నకేశవరావు, ఎం.సుబ్రహ్మణ్యం పోలు మురారి సుబ్బారావు పాల్గొన్నారు.

అమిత్ షా పర్యటనకు నిరసన

క్రోసూరు: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ సెంటర్ వద్ద ఆదివారం వామపక్షాల నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.రవిబాబు మాట్లాడుతూ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. దీంతో రాష్ట్రంలో అమిత్ షా పర్యటనను నిరసిస్తున్నట్లు పేర్కొన్నారు. బీఎస్పీ నియోజకవర్గ నాయకుడు గనుపల్లి శేఖర్, సీపీఐ మండల కార్యదర్శి పి.నాగేశ్వరావు, సీపీఎం కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు బీజేపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించారు. సీపీఎం సీనియర్ నాయకులు ఆవుల ఆంజనేయులు, వేపూరి వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు కంచేటి పెద్దబ్బాయి, సీపీఎం కార్యదర్శి చిలకా యేసయ్య , కుంభా లక్ష్మయ్య పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశం



డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు పట్టణంలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు హాజరవుతారని పేర్కొననారు. సమావేశంలో ఇటీవల సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా నియమితులైన డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డిని పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పరిచయం చేయడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

పెద్ద నిర్లక్ష్యమే..!

రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ ఎంత అధ్వానంగా ఉందో ఈ ఒక్క చిత్రమే నిదర్శనం. ముప్పాళ్ల గ్రామస్తులందరికీ తాగునీరు అందించాల్సిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను పిచ్చి మొక్కలు తీగలు అల్లుకుని పోయాయి. పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖాధికారుల నిర్లక్ష్యం అద్ద పడుతోంది. తీగల ద్వారా పాములు, ఇతర కీటకాలు ట్యాంకులో పడితే కనీసం పట్టించుకునే వారు కూడా లేరు.

– ముప్పాళ్ల



విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం కార్యవర్గం ఎంపిక

వినుకొండ(నూజెండ్ల): విశ్వబ్రాహ్మణ సంఘీయులందరూ ఐకమత్యంతో అన్నదాన సత్రం అభ్యున్నతికి సహకరించాలని అద్దంకి సుధాకర్ అన్నారు. నూజెండ్ల మండలం రవ్వారం గ్రామంలో వేంచేసియున్న శ్రీకొండ గురునాథ స్వామి సన్నిధిలో అన్నదాన సత్రం నూతన కార్యవర్గం ఎంపిక కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా అన్నదాన సత్రం నూతన అధ్యక్షుడు అద్దంకి సుధాకర్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అన్నదాన సత్రం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. నల్లగట్ల ఈశ్వరచారి అధ్యక్షతన కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికల అనంతరం ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. నూతన ఉపాధ్యక్షులుగా కుందుర్తి సీతారామాంజినేయులు, చందలూరి శివనాగేశ్వరరావు, సెక్రటరీ జుజ్జురి వాసవాచారిలను, పాత కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు. స్థలదాత లక్కిరెడ్డి సంజీవరెడ్డి, గౌరవ అధ్యక్షుడు వావిచర్ల వెంకటేశ్వర్లు నూజెండ్ల మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మోతడక వీరాచారిలను ఘనంగా సత్కరించారు.



నూతన కార్యవర్గానికి సన్మానం

పెయింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ నియోజకవర్గ పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక సీపీఎం కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్‌గా ప్రముఖ చిత్రకారుడు బొడ్డుచర్ల ప్రసాదరావు, వైస్ ప్రెసిడెంట్‌లుగా ఎం.మూర్తి, ఆర్.శంకర్, సెక్రటరీగా కె.వందనంబాబు, జాయింట్ సెక్రటరీలుగా సిహెచ్ బాజీ, బీరం శ్రీను, ట్రెజరర్ ఎస్.కె.సైదాలును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కమిటీ రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని, అలాగే పెయింటర్స్, ఆరిస్టులకు ప్రభుత్వం ద్వారా అందవలసిన సంక్షేమ పథకాలు ఇంటి స్థలాలు, గుర్తింపు కార్డులు కొరకు కృషి చేస్తామని, వారికి అండగా పనిచేస్తామని తెలిపారు. ఎం.పోలు రాజు, ఎస్.రాజు కుమార్ సింగ్, జి.చంద్రం, కె.నాగరాజు, పి.రామకృష్ణ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

అయోధ్య రాముని విల్లుకు పూజలు

దాచేపల్లి : అయోధ్యరాముని కోదండ విల్లు ఆదివారం దాచేపల్లికి చేరుకుంది. హైదరాబాద్ నుంచి నగర పంచాయతీ పరిధిలోకి ప్రవేశించిన విల్లుకి భక్తులు స్వాగతం పలికారు. హైదరాబాద్‌కు చెందిన చల్లా శ్రీనివాసశాస్త్రి అనే భక్తుడు కేజీ బంగారం, 13 కేజీల వెండితో విల్లు, బాణం తయారు చేయించి అయోధ్యకు పంపిస్తున్నాడు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, వీర్ల అంకమ్మతల్లి దేవాలయంలో పూజలు నిర్వహించారు.

